తోటల్లోనే రాలుతున్న టమాట

టమాట పంట సాగు జూదంలా మారింది. ధరలు పతనమైనప్పుడు పంట దిగుబడి బాగా రావడం, ధరలు వున్నప్పుడు రకరకాల తెగుళ్లతో పంట దెబ్బతినడం ప్రతి ఏటా జరుగుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం టమాటా బాక్సు రూ.300 దాకా ధర పలుకుతోంది. ఈ తరుణంలో పలమనేరు ప్రాంతంలోని టమాటా పంటకు అంతుచిక్కని వ్యాధి సోకింది. కాయలు ఉన్నట్టుండి చెట్టు నుంచి రాలిపోతున్నాయి. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు అయోమయంలో పడ్డారు.

- పచ్చికాయలే మొదళ్ల నుంచి రాలుతున్న వైనం
- ఏమి చేయాలో తెలియక అయోమయంలో రైతులు
- తొడిమి కుళ్లు రోగమంటున్న అధికారులు




బైరెడ్డిపల్లి సమీపంలోని చీలంపల్లి రైతు తోటలో నేలరాలిన టమాటాలు

పలమనేరు: పలమనేరు డివిజన్ పరిధిలో ఇప్పుడు అన్‌సీజన్ కాబట్టి సుమారు 2 వేల హెక్టార్లలో టమాటా పంట సాగు చేశారు. ఇందులో 500 హెక్టార్లలో పంట పిందె, కోత దశల్లో ఉంది. కొన్ని గ్రామాల్లో పంట దిగుబడి బాగానే వుంది. మార్కెట్‌లో ధరలు కూడా బాగానే ఉన్నాయి. బాక్సు రూ.300 వరకు ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో నష్టాల నుంచి కొంత మేర గట్టెక్కవచ్చని రైతులు భావించారు. పంటకు అంతుచిక్కని వ్యాధి సోకడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. కాయలు ఉన్నట్టుండి చెట్టు నుంచి రాలిపోతుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా మెట్ట భూముల్లో నాటిన టమాటా చెట్ల కంటే కీలేర్లు లేదా నీరు నిల్వ ఉండే భూముల్లో నాటిన టమాటా చెట్ల ఆకులపై మచ్చలు పడడం, ఆపై తొడిమి కుళ్లి కాయలు రాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. తెగులు నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా, గమ్‌స్టిక్స్ అమర్చినా కూడా కాయలు రాలడం ఆగడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం బైరెడ్డిపల్లి మండలంలోని చీలంపల్లి, సాకేవూరు, పెద్దపంజాణి మండలంలోని మాడి తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. సాధారణంగా టమాట పంటకు ఏదైనా తెగులు సోకితే దానికి అవసరమైన క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తే పోయేదని, ప్రస్తుతం ఎన్ని మందులు చల్లినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. కోత దశలోని తోటల్లో తొడిమలు కుళ్లి కాయలు రాలిపోతుండడంతో ఏమి చేయాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటల్లో నీటిశాతం ఎక్కువైనప్పుడు తొడిమిపై నీరు చేరడంతో అందులోకి ఫంగస్ చేరడం వల్లే ఇలా కాయలు రాలుతున్నాయని కొందరు రైతులు చెబుతున్నారు. ఇలాంటి తోటలను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

తోటలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఎక్కువగా వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండే తోటల్లో ఇలాంటి సమస్యలు రావచ్చు. ఇంత భారీగా కాయలు రాలడం అనేది ఎన్నడూ జరగలేదు. ఆ తోటలను నేరుగా పరిశీలించాకే అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా చీలంపల్లి ప్రాంతంలోని తోటలను పరిశీలించాలని అధికారులను ఆదేశిస్తాం.

–డాక్టర్ కోటేశ్వరరావు, సహాయ సంచాలకులు, పలమనేరు

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుంగనూరు: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 3 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఎంఈవో కార్యాలయం తనిఖీ



అధికారులతో చర్చిస్తున్న సమగ్ర శిక్ష సహాయ కో ఆర్డినేటర్ వెంకటరమణ

శాంతిపురం: స్థానిక ఎమ్మార్సీని శుక్రవారం సమగ్ర శిక్ష ప్రాజెక్టు అడిషనల్ కో ఆర్డినేటర్ ముదిపట్ల వెంకటరమణ తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సీఆర్ఎంటీ టూర్ డైరీలు, వర్క్ ఎంట్రిస్ట్‌మెంట్ రిజిస్టర్ల నమోదుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా కార్యక్రమాలు సాగుతున్న తీరుపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 చంద్రమ్మ, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



అంత్యక్రియలకు హాజరైన పెద్దిరెడ్డి, నాయకులు

సదుం: మండలంలోని గాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ రెడ్డిదీప శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. చంద్రయ్య భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పుట్రాజు, శివారెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

శాంతిపురం: వినాయ చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక శివాలయం వీధి, కేజీఎఫ్ రోడ్ యువకులు రక్తదానం చేశారు. గత 17 సంవత్సరాలుగా వినాయక చవితిని నిర్వహిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. 40 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. వి.కోట ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ మురళి, టెక్నీషియన్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం



చెంచులక్ష్మిని సన్మానిస్తున్న టీచర్లు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ టీచర్ చెంచులక్ష్మీ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను శుక్రవారం ఎంఈవో నటరాజ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఎంతో మంది విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులతో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లి: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ కలిగి ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఎంపీడీవో రాజేంద్రబాలాజీ తెలిపారు. మండలంలోని పెద్దచల్లారగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు పౌరహక్కుల దినోత్సవం

సదుం: మండలంలోని పాలమంద మిట్టపల్లెలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తహసీల్దారు ప్రమీల తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, దళిత సంఘాల నాయకులు హాజరుకావాలని సూచించారు.

సింగిల్‌విండోల్లో రూ.15 లక్షల వరకు రుణాలు

పుంగనూరు: పట్టణంలోని సింగిల్‌విండోలో రైతులకు రూ.15 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వనున్నట్టు చైర్మన్ రమణ తెలిపారు. ఆయన శుక్రవారం డీసీసీబీ చీఫ్ మేనేజర్ రాధారాణి ఆధ్వర్యంలో రైతులు, ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఇంటి మీద సోలార్ సిస్టంను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రూ.2 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు 12 శాతం వడ్డీతో రుణాలు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంచిలో ఏముంది?



మర్రి చెట్టుకు వేలాడుతున్న సంచి

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని బోడిపాటివారిపల్లెకు వెళ్లే దారిలో శ్మశానం పక్కనే ఉన్న మర్రి చెట్టుకు ఒక తెల్ల సంచి బరువుగా వేలాడుతోంది. దాన్ని చూసిన స్థానికులు అందులో ఏముందోనని ఆందోళన చెందుతున్నారు. ఆ సంచి 20 రోజులుగా మర్రిచెట్టుకు వేలాడుతోంది. ఎవరూ సాహసం చేసి సంచిని కిందకు దించి చూడడం లేదు. శ్మశానం కావడం, చెట్టుకు సంచి వేలాడదీయంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు దాన్ని పరిశీలించి మర్రి చెట్టుకు వేలాడుతున్న సంచిలో ఏముందో పరిశీలించి భయాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక వికాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

పలమనేరు: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. మన దేశానికి మూడు ఒలింపిక్ స్వర్ణ పతకాలను అందించిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ స్ఫూర్తితో నేటి విద్యార్థులు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ క్రీడాకారిణి అక్షయకు అభినందనలు

పలమనేరు పట్టణానికి చెందిన జాతీయ రగ్బీ క్రీడాకారిణి అక్షయను క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి శుక్రవారం అభినందించారు. ఇలాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు.

వినాయకుడి లడ్డూ రూ.24 వేలు



వినాయక లడ్డూను రూ.24 వేలకు దక్కించుకున్న మహేష్

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పాతకురవపల్లెలో వినాయకుడి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన లడ్డూ వేలం పాటల్లో రూ.24 వేలు పలికింది. ఇక్కడ వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేసి 11 కిలోల లడ్డూను పెట్టారు. శుక్రవారం వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ క్రమంలో లడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెందిన మహేష్ రూ.24 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు.

మృతుల కుటుంబాలకు పెద్దిరెడ్డి పరామర్శ



మిట్టమీదపల్లెలో రెడ్డెప్పరెడ్డి తల్లి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



శ్రీరాములువడ్డిపల్లెలో రమణయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: వివిధ కరణాలతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను శుక్రవారం మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. మండలంలోని చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీ శ్రీరాములు వడ్డిపల్లెకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్, మాజీ ఉప సర్పంచ్ రమణయ్య (65) గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. అలాగే పెద్దగొట్టిగల్లు పంచాయతీ మిట్టమీదపల్లెకు చెందిన ఓబుళరెడ్డెప్పరెడ్డి తల్లి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామాలకు చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, చెంచురెడ్డి, కరీముల్లా, కోటా వెంకటరమణ, సూర్యనారాయణరెడ్డి, యుగంధర్ రెడ్డి, ఓ.సిద్ధరామిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, యర్రంరెడ్డి పాల్గొన్నారు.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు



వి.కోట : నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడి విగ్రహాలు



వి.కోట : నిమజ్జనంలో భక్తుల సందడి



పుంగనూరు: కొత్తపేటలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా యువకుల కోలాహలం



బైరెడ్డిపల్లె: శెట్టిపల్లెలో ఉట్ల మాను ఎక్కుతున్న యువకులు

పుంగనూరు: పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. రాగానిపల్లె రోడ్డు, జోగివాండ్ల ఇండ్లు, కొత్తపేట, మార్కెట్ యార్డు ప్రాంతాల్లోని గణేష్ విగ్రహాలను ట్రాక్టర్‌లో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు హరిప్రసాద్, రమణ బందోబస్తు చేపట్టారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం, శెట్టిపల్లె, కూటలవంక తదితర గ్రామాల్లో శుక్రవారం వినాయకుడి విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. వినాయక చవితి సందర్భంగా బుధవారం వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేసి మూడు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. శెట్టిపల్లెలో ఉట్ల మాను కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండల కేంద్రమైన వి.కోటలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ డ్యాన్స్ చేస్తూ కేరింతలు కొట్టారు. సీఐ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. వినాయకుడి విగ్రహాలను ఊరేగింపుగా పత్రపల్లి చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ క్రేన్‌లతో నిమజ్జనం చేశారు. అక్కడ గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూటమి మోసాలను జనానికి వివరిద్దాం



పార్టీ నాయకులతో బాలాజీనాయుడు

పలమనేరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్‌సీపీ పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం టి.వడ్డూరు, జగమర్ల పంచాయతీల పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త వెంకటేగౌడ ఆధ్వర్యంలో సోమవారం కొలమాసనపల్లిలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశాల్లో టి.వడ్డూరు అధ్యక్షుడు కేశవ, యూత్ నాయకులు మనోజ్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సునీత, జగమర్ల పంచాయతీ అధ్యక్షుడు మునిరత్నం రెడ్డి, అశోక్, లవకుమార్, సావిత్రి, రంగన్న, చెంగారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా నామకరణం చేయాలి

పుంగనూరు: కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు కానున్న మదనపల్లె జిల్లాను శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా నామకరణం చేయాలని రాయల్ పీపుల్ ఫ్రంట్ కార్యదర్శి మధురాయల్ డిమాండ్ చేశారు. స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో శుక్రవారం బలిజ కులస్తుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేసి, పేరును శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీనికి బలిజ సంఘం నాయకులు మద్దతు ఇవ్వాలని కోరారు. నానబాలమణి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

పుంగనూరు: బాల్యవివాహాలు నేరమని, వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మూర్తి తెలిపారు. పట్టణంలోని మేలుపట్ల బాలికల వసతి గృహంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల గర్భం దాల్చడం, పిల్లల పోషణ తదితర కారణాలతో బాలికలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే 1098, 112, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ రంజిత, సీడీపీవో రాజేశ్వరి, ఎంఈవో రెడ్డెన్నశెట్టి పాల్గొన్నారు.

తెలుగు భాష తల్లిలాంటిది



గంగవరం : తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పుంగనూరు : గూడూరుపల్లె హైస్కూల్‌లో వేడుకలు



కుప్పం రూరల్ : గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళి



చౌడేపల్లె : చారాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు భాష కోసం కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారని గుర్తుచేశారు. తెలుగును 'ది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పిలుస్తారని చెప్పారు. 16వ శతాబ్దంలో ఇటాలియన్ యాత్రికుడు నికోల్ డి కాంటే ఇటాలియన్ భాష వలే తెలుగు కూడా అచ్చులతో ముగుస్తుందని కొనియాడినట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్ 2012లో తెలుగు భాషను లిపి పరంగా ప్రపంచంలోనే 2వ భాషగా గుర్తించినట్లు చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న తెలుగును మరువరాదన్నారు.

– కుప్పం రూరల్/గుడుపల్లె/పుంగనూరు/చౌడేపల్లె/రొంపిచెర్ల/గంగవరం

- కుప్పంలోని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, భాస్కరన్, కోదండరామయ్య, పీఆర్వో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.
- గుడుపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.
- పుంగనూరు మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మహేష్ నారాయణ, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కె.సోమరాజ్, సురేష్‌రెడ్డి, భారతి, రెడ్డిరాధిక, నిర్మల, విశ్రాంత తెలుగు టీచర్ వెంకటపతి పాల్గొన్నారు.
- చౌడేపల్లె మండలంలోని చారాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రేణుక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి ర్యాలీ చేశారు. అలాగే పీఈటీ రాజేంద్ర ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
- రొంపిచెర్లలోని కేజీబీవీలో ప్రత్యేక అధికారి సుజాత ఆధ్వర్యంలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు పలు విన్యాసాలు చేశారు. ఉపాధ్యాయులు హేమలత, నాగమణి, నాగేశ్వరి, పూజ, లలిత, జ్యోతి, రాధ, పీఈటీ సహీరా పాల్గొన్నారు.
- గంగవరం మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. నల్లగుట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భాషా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.